క్లుప్తంగా

జగనన్న కాలనీ వద్ద ఆక్రమణలు తొలగించాలి



జగనన్న కాలనీ వద్ద ఆక్రమణను పరిశీలిస్తున్న కమిషనర్, వైస్ చైర్మన్ తదితరులు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీ వద్ద ఆక్రమణలను ప్రారంభంలోనే తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అన్నారు. జగనన్న కాలనీ వద్ద ఆక్రమణలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. తోపుడు బండి పేరుతో ఏర్పాటు చేసి శాశ్వతంగా బడ్డీ ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. కాలనీవాసుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రహరీ వద్ద ప్రారంభమైన ఆక్రమణతో జగనన్న కాలనీ వద్ద ఆక్రమణలు పెరిగిపోయే అవకాశం ఉందని వైస్‌చైర్మన్ తెలిపారు. ఈ ఆక్రమణలను తొలగించక పోతే అనేక మంది జగనన్న కాలనీ చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారి దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి ఆక్రమణలను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై అప్రమత్తం

ఎంపీడీఓ ఉషారాణి



కాండ్రకోటలో తాగునీటి నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో అమలు చేస్తున్న తాగునీటి సరఫరాపై మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌తో కలిసి ఆమె తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వాతావరణ మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం గ్రామంలో మంచినీటి సరఫరాపై ఆరా తీసి, నీటి నమూనాలను పరీక్షలు చేయించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి బషీర్, సీతామహాలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ప్రజా పరిష్కార వేదిక అర్జీలు పరిష్కరించాలి



పిఠాపురంలో అధికారులతో సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రజా పరిష్కార వేదిక అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కాకినాడలోని హౌసింగ్ కార్యాలయంలో శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలోని హౌసింగ్ గృహాల ప్రగతిపై ఆశాఖ ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలోని ప్రస్తుతం ఉన్న నిర్మిస్తున్న ఇళ్లు, అవి ఏఏ దశల్లో ఉన్నాయి, ఇంకా ఎంతమంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు, వారికి ఎంత మొత్తం ఇవ్వాల్సి ఉంది తదితర విషయాలు సమీక్షించారు.

బాలా త్రిపుర సుందరి ఆలయంలో వేద ఘోష



బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో వేదపారాయణ చేస్తున్న వేదపండితులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం శుక్రవారం వేద పారాయణతో మార్మోగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న టీటీడీ వేద పండితులు బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు వేద పారాయణ చేయనున్నట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ జరుగుతుందన్నారు. తొలుత పండితులు ఆలయంలో రామలింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, అనంతరం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.



ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై చురుగ్గా ఫ్లోరింగ్ పనులు



నిర్మాణంలో ఉన్న ఏసీ ప్రయాణికుల విశ్రాంతి భవనం



సాధారణ ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న షెడ్లు

కోటకు కొత్త హంగులు

- చురుగ్గా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు
- రూ.25 కోట్లతో పలు నిర్మాణాలు
- రైళ్ల రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు



సామర్లకోట రైల్వే స్టేషన్ ముఖద్వారం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. జిల్లా ముఖ్య కూడలిగా ఉన్న సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా రూ.25 కోట్లు విడుదలైనట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నిధులతో ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్‌తో పాటు, వెయిటింగ్ రూమ్‌లు, షెడ్లు, విశ్రాంతి భవనం, స్టేషన్ మేనేజరు, సిగ్నల్ డిపార్టుమెంట్ కార్యాలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలోని ఎక్కడా లేని విధంగా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ ఎదురెదురుగా ఇక్కడే ఉంటాయి. అలాగే కాకినాడ వెళ్లే రైళ్లు కాకుండా ఇటు విశాఖ వైపు, అటు విజయవాడ వైపు వెళ్లాల్సిన సమీప ప్రాంతాల ప్రయాణికులు ఈ స్టేషన్‌కే వచ్చి రైలు ఎక్కాల్సి ఉంటుంది. కాబట్టి సాధారణంగానే ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది. తాజా అభివృద్ధి పనులతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జితో ట్రాఫిక్‌కు చెక్

సహజంగా రద్దీ ఉన్న ప్రాంతాల్లోనే వ్యాపారాలు లాభదాయకంగా సాగుతాయి. దీంతో ఇక్కడ స్థిర, చర వ్యాపారులు ఎక్కువగానే ఉంటారు. దీంతో క్రయ విక్రేతలతో సహజంగానే రద్దీ ఏర్పడి తరచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య పరిష్కారానికి రైల్వే స్టేషన్ నుంచి బస్సు కాంప్లెక్స్‌కు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అనివార్యమని సర్వత్రా అభిప్రాయం ఉంది.

రైళ్ల రద్దుతో వ్యాపారాలు డీలా

సామర్లకోట మీదుగా రాకపోకలు జరిగే రత్నాచల్, ఉదయ్, కోకినాడ, సింహాద్రి, రాయగడ, మచిలీపట్నం ఎక్సుప్రెస్‌లను ఆగస్టు 10 తేదీ వరకు రద్దు చేశారు. దాంతో ప్రయాణికుల సంఖ్య తగ్గి ప్లాట్‌ఫాం వ్యాపారాలు భారీగా తగ్గిపోయాయని ఆ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.

50 శాతానికి పడిపోయింది



రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 40 ఏళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నా. తాజాగా రైళ్ల రద్దుతో తమ వ్యాపారం 50 శాతానికి పడిపోయింది.

– జీలకర్ర రవి, పండ్ల వ్యాపారి, సామర్లకోట

సర్వాంగ సుందరంగా రైల్వే స్టేషన్



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ నుంచి బస్సు కాంప్లెక్స్‌కు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం సాధ్యం కాదు. ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇతర రైల్వే స్టేషన్లలో ట్రాక్‌ల అభివృద్ధి నేపథ్యంతో కొన్ని రైళ్లను ఇక్కడకు రాకుండా దారి మళ్లించారు. దీంతో ముందుగా రిజర్వేషన్లు చేయించుకున్న వారికి పూర్తి మొత్తం వాపసు ఇస్తాం. పారిశుద్ధ్య పనుల కాంట్రాక్టు జూలైతో ముగుస్తుంది. ఆగస్టు నుంచి సిబ్బంది పెరిగే అవకాశం ఉంది. కాబట్టి స్వచ్ఛ రైల్వే స్టేషన్ సంకల్పం నెరవేరనుంది.

– ఎం రమేష్, స్టేషన్ మేనేజర్, సామర్లకోట

పిఠాపురంలో పర్యటించిన కలెక్టర్ షాన్ మోహన్



పిఠాపురం-ఉప్పాడ సెంటర్‌లో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

పిఠాపురం: పట్టణంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పర్యటించారు. జూన్ 1న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఉప్పాడ సెంటర్‌లో నిర్వహించే వారాహి సభా స్థలాన్ని పరిశీలించారు. సభ నిర్వహణపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల అనంతరం మొదటిసారిగా నిర్వహించే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మి , జెడ్పీ సీఈఓ శ్రీరామ చంద్రమూర్తి, పిఠాపురం సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు

సామర్లకోట: రైసు మిల్లర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం అచ్చంపేటలో ఎమ్మెల్యే రాజప్ప స్వగృహంలో కలిసారు. కాకినాడ జిల్లా రైసు మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షునిగా వేట్లపాలెం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి రైసు మిల్లు అధినేత నున్నా రామకృష్ణ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిసారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం లలితా రైసు మిల్లు అధినేత మట్టే శ్రీనివాసు, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం తినాలి



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పాఠశాలల్లో విద్యార్థులు అందరూ కలిసి ఒకే చోట భోజనం చేయడం ద్వారా వారి మధ్య మంచి భావం ఏర్పడుతుందని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని కొత్తూరు-2 ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మంచినీరు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. భోజన పథకానికి ఉపయోగిస్తున్న వంట పాత్రలను ఆయన తనిఖీ చేశారు. వంట పాత్రలు ప్రతీ రోజు శుభ్రం చేసిన తరువాత మాత్రమే వంటలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇచ్చిన నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్కరూ పాఠశాలలోనే భోజనం చేసేలా విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు అందజేసే భోజనాన్ని నిత్యం ఉపాధ్యాయులు రుచి చూడాలన్నారు. మెనో ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెరగాలని, ఈ మేరకు పాఠశాలకు హాజరు కాని తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాలన్నారు. బడి బయట పిల్లలు ఉండకుండా చూడాలని సూచించారు. ఈ మేరకు నేను బడికి పోతా ర్యాలీలను నిర్వహించాలని చెప్పారు.

వారు అతిసార రోగులు కాదు

- సీహెచ్‌సీ వైద్యాధికారి అమల
- సీజనల్ వ్యాధిగ్రస్తులకు కౌన్సిల్ సభ్యుల పరామర్శ



సామర్లకోట సీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేసిన కమిషనర్, వైస్ చైర్మన్ తదితరులు

సామర్లకోట: స్థానిక సీహెచ్‌సీలో అతిసార రోగులు చికిత్స పొందుతున్నారన్న ఆరోపణలు, సమచారం మేరకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు శుక్రవారం వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమల వారితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు గురైన వారు మాత్రమే ఇక్కడ చికిత్స పొందుతున్నారని, అతిసార లక్షణాలు కనిపిస్తే ప్రత్యేక వైద్యం చేస్తామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు రోగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడుతూ పట్టణంలో అతిసార వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రతి రోజు మున్సిపాలిటీ నుంచి సరఫరా అవుతున్న నీటిని పరిశీలిస్తున్నామని, మున్సిపల్ అధికారులు స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారి వెంట కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్, స్వయంభారపు వీరభద్రరావు, కరణం రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి నెలా జరిగే సమావేశంలో భాగంగా ఈ సమావేశం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులకు సంబంధించి 13 అంశాలతో తయారు చేసిన అజెండాపై చర్చ ఉంటుందన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

3న మండల పరిషత్ సమావేశం

సామర్లకోట: ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చేనెల మూడో తేదీన జరుగుతుందని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు. ఆయా శాఖలపై సమీక్ష జరిగే అవకాశం ఉన్నందువల్ల అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

రాక్ సిరామిక్స్ కార్మికుల మోటారు సైకిళ్ల ర్యాలీ



మోటారు సైకిళ్ల ర్యాలీ చేస్తున్న కార్మికులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో తొలగింపునకు గురైన కార్మికుల సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ కార్మికులు శుక్రవారం మోటారు సైకిలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ గేటు నుంచి ర్యాలీగా అచ్చంపేటలోని ఎమ్మెల్యే రాజప్ప స్వగృహానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. 18 ఏళ్లగా పని చేస్తున్న కార్మికులను ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తరుణంలో విధుల నుంచి తొలగించారన్నారు. వారిని తొలగించి 75 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు సమస్య పరిష్కరించలేదన్నారు. కాగా ఫ్యాక్టరీ యజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజప్ప కార్మికులకు హామీ ఇచ్చారు. కార్మికులు సుబ్బారావు, శివనారాయణ, సతీష్‌కుమార్, రాజబాబు, రామచంద్రయ్య, ప్రభుదాసు, చంద్రన్న, సత్యనారాయణ, మూర్తి, చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోరుతూ ఆర్బీకే సిబ్బంది వినతి

కాకినాడ సిటీ: జిల్లాలోని ఆర్బీకేల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని క్రాంతికుమార్, లక్ష్మీ తదితరులు శుక్రవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2023లో గత ప్రభుత్వంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా తమను ఎంపిక చేశారని, ఆర్బీకేల్లోని ఉద్యోగులు, ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండు నెలలు మాత్రమే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ఈ కేంద్రంలో పని చేస్తున్న వారందరికీ ఏడాది పాటు ఉద్యోగ బాధ్యతలు అప్పగించేలా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో 1000 మంది వివిధ హోదాల్లో పని చేస్తున్నారని, తమకు న్యాయం చూడాలని కోరారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు ముష్టి పురుషోత్తం, దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 15 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ కుంకుమపూజలు నిర్వహించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు



అన్న క్యాంటీన్ కోసం స్కూల్ మార్పు



పాఠశాల మార్పుపై కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప



తిరిగి అన్న క్యాంటీన్‌గా మారుస్తున్న పాఠశాల భవనం

- సామర్లకోటలో టీడీపీ నేతల నిర్ణయం

సామర్లకోట: అన్న క్యాంటీన్లను తిరిగి ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో స్థానిక జగ్గమ్మగారి పేటలోని పేద విద్యార్థులు చదువుకునే మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలకు ముప్పు వచ్చింది. ఈ స్కూల్‌ను గతంలో ఓ అద్దె భవనంలో నిర్వహించేవారు. అన్న క్యాంటీన్లు మూతబడ్డాక దానిలోకి ఈ పాఠశాలను మార్చారు. ఇప్పుడు ఈ పాఠశాలను ఇక్కడి నుంచి మరో చోటకు మార్చాలని టీడీపీ నేతలు నిర్ణయించారు. ఈమేరకు ఆ వార్డు కౌన్సిలర్లు, వార్డు ప్రజలతో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సమక్షంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం సమావేశం నిర్వహించారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు పాఠశాల భవనం నిర్మించాలని ఆ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ సూచించారు. దీనికోసం నిధులు తీసుకుని వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చివరకు ఈ పాఠశాలను సత్యనారాయణపురంలోని భరద్వాజ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోనికి మార్చడానికి ఆ ప్రాంత ప్రజలు అంగీకరించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



నాగులాపల్లిలో తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

- జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి
- పిఠాపురంలో నియోజకవర్గస్థాయి అధికారులతో సమావేశం

పిఠాపురం: డయేరియాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామ చంద్రమూర్తి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జూలై 1 నుంచి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటిస్తారని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జీఎస్ రామ్‌గోపాల్, జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకం పరిశీలన

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి పథకాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి పరిశీలించారు. తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్లు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, పథకం నమూనాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, డయేరియా వంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అధికారులు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రధాన పైపులైన్లు దెబ్బతింటే తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ భారతి, డీఈ శ్రీదేవి, జెఈ సంధ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి

సత్యదేవుని దర్శించిన విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి

అన్నవరం: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ (తూర్పుగోదావరి) సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.



ఎస్పీ సుబ్బారెడ్డికి సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు